# కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లే మిగిలాయి

## రైతులకు కరెంటు లేదు.. నీళ్లు లేవు..

- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి
- బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లావుడ్యా పూర్ణ



**కొత్తగూడెం, ఏప్రిల్06(కెరటం ప్రతినిధి)**

రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరిధ్యానం పంటకు రూ. 500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ.12000, ఎండిన పంటకు ఎకరాకు రూ.25000 వెంటనే చెల్లించి, కౌలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లావుడ్యా పూర్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రైతులకు కరెంటు లేదు.. నీళ్లు లేవు.. కన్నీళ్లే మిగిలాయని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టులలో నీళ్లు ఉన్న రైతుల పంటలకు నీళ్లు ఇవ్వకుండా రైతులకు ద్రోహం చేస్తున్నారని, పంటలు ఎండిపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ, చనిపోయిన రైతులకు నష్ట పరిహారంతో పాటు, వారి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలు, ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను, రైతులను వేధిస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నీరు లేక ఎండిన పంటలకు నష్టపరిహారం క్వింటాలకు 500 రూపాయల బోనస్‌తో పాటుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9 తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చి రైతులను రాష్ట్ర ప్రజలను మోసం చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు రైతులకు రైతుబంధు ఏనాడు కూడా ఆగింది లేదని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు కింద 15000 రైతు కూలీలకు 12,000 కౌలు రైతులకు 15000 ఇస్తామని చెప్పి ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో తప్పకుండా గుణపాఠం చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లావుడ్యా పూర్ణ పిలుపునిచ్చారు.




## దక్షిణాసియాలో వృద్ధే లక్ష్యంగా..

- క్వాలిటీ కేర్ గ్రూప్ ఛైర్మన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ హరి ప్రసాద్ నియామకం
- మేనేజింగ్ డైరెక్టర్‌గా వరుణ్ ఖన్నా



**హైదరాబాద్, ఏప్రిల్ 2024:**

భారతదేశంలో అతిపెద్ద కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ ప్రధాత క్వాలిటీ కేర్.. మార్క్యూ గ్లోబల్ ఇన్వెస్టర్లు బ్లాక్‌స్టోన్, టీపీజీ మద్దతుతో దక్షిణాసియాలో వృద్ధే లక్ష్యంగా క్వాలిటీ కేర్ గ్రూప్ ఛైర్మన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ హరి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వరుణ్ ఖన్నా నియమితులయ్యారు. డాక్టర్ హరి ప్రసాద్ కు ముప్పై సంవత్సరాల అనుభవం ఉంది. ఇటీవల అపోలో గ్రూప్ హాస్పిటల్స్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. అపోలో హాస్పిటల్స్ 1,200 పడకల నుంచి 10,000 పడకల స్థాయికి ఎదగడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కూడా పని చేస్తున్నారు. రాయల్ కాలేజ్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్, యూకే, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఆయన్ను ఫెలోషిప్‌తో సత్కరించింది. ఆస్ట్రేలియాలోని మాక్వేరీ విశ్వవిద్యాలయం గ్లోబల్ ఎండీ ప్రోగ్రామ్‌కు క్యాంపస్ డీన్‌గా కూడా ఉన్నారు. ఆసియాలో మొట్టమొదటి ఆరోగ్య నగరమైన హైదరాబాద్‌లో అపోలో హెల్త్ సిటీని స్థాపించడంలో ఆయన సహాయం చేశారు. తన విస్తారమైన వైద్య నైపుణ్యాన్ని, తిరుగులేని దృష్టిని, వైద్య విజ్ఞాన రంగంలో నేర్చుకున్న విషయాలను సంస్థకు తీసుకువస్తున్నారు.



## మొట్టమొదటి తెలుగు చాప్టర్ 'బీఎన్ఐ అక్షర' ప్రారంభం

**- తెలుగు బాషలో వ్యాపార లావాదేవీలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 2, 2024:**

తెలుగు బాషలో వ్యాపార లావాదేవీలు జరుపుకునేందుకు వీలుగా బీఎన్ఐ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలుగు చాప్టర్ 'బీఎన్ఐ అక్షర' ను నాగోల్‌లోని ఎస్వీఎం గ్రాండ్ హొటల్‌లో మంగళవారం ప్రారంభించారు. వివిధ వ్యాపార వర్గాలకు చెందిన నలభై ఆరు మంది వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నారు. ప్రపంచంలోని మొట్టమొదటి తెలుగు చాప్టర్ ఇది. బీఎన్ఐ అక్షర ప్రతి మంగళవారం నాగోల్ ఏరియాలో రిఫరల్స్, వ్యాపారాన్ని మార్పిడి చేసుకోవడానికి సమావేశం నిర్వహించనుంది. తెలుగు చాప్టర్ సభ్యులు తమ వ్యాపార సంభాషణలు, లావాదేవీలు తెలుగు భాషలో కమ్యూనికేట్ చేయడానికి, నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. ఈ సమావేశంలో 46 మంది సభ్యులు తమ వ్యాపారాలు, సేవలను పరిచయం చేసుకు న్నారు. 80 మంది వ్యాపార రిఫరల్‌లను పరస్పరం మార్చుకున్నారు. బీఎన్ఐ హైదరాబాద్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా కోడ్ ఆఫ్ ఎథిక్స్‌పై ప్రమాణం చేయించారు. ఐదుగురు కొత్త సభ్యులు ఈ చాప్టర్లోకి ప్రవేశించారు. వేణుగోపాల్ రావు పీచారా, నాగేంద్ర కుమార్ ఒక్కొక్కరు ఆరుగురికి పైగా సభ్యులను చాప్టర్‌లో చేర్చారు. గోల్డ్ పిన్‌ను అందించారు. బీఎన్ఐ గోల్డ్ క్లబ్‌లో భాగమయ్యారు. ఇది అతిపెద్ద దాతల ఎలైట్ క్లబ్. వివిధ రంగాలకు చెందిన 128 మంది వ్యాపారవేత్తలు ఈ సమావేశానికి విజిటర్స్‌గా హాజరయ్యారు. వీరిలో చాలా మంది చాప్టర్‌లో చేరడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.

బీఎన్ఐ ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాపార నెట్‌వర్కింగ్, బిజినెస్ రెఫరల్ ఆర్గనైజేషన్ అన్నారు. 39 ఏళ్ల క్రితం స్థాపించబడిందని తెలిపారు. 79 దేశాలలో 3.2 లక్షల మంది సభ్యులను కలిగి ఉందన్నారు. గత ఏడాది సభ్యులలో %వి% 22.01 బిలియన్ల వ్యాపారాన్ని ఆర్జించిందన్నారు. గీవార్స్ గెయిన్ అనేది బీఎన్ఐ ప్రధాన విలువ, సభ్యులకు నెట్‌వర్క్ చేయడానికి, సహకరించడానికి, అంతర్దృష్టులను పంచుకోవడానికి, వ్యాపార సిఫార్సులకు అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ అక్షర లాంచ్ డైరెక్టర్ డాక్టర్ వీరమనేని వేణుగోపాలరావు, సీనియర్ లాంచ్ డైరెక్టర్ కవల్జీత్ సింగ్, రాయబారి విద్యాధర్ రెడ్డి, సీనియర్ డైరెక్టర్ కన్సల్టెంట్ రాంబాబు, అసిస్టెంటు ఏరియా డైరెక్టర్ రాధా కృష్ణ, ఏరియా డైరెక్టర్ సతీష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ డైరెక్టర్ కన్సల్టెంట్ శ్రీనివాసులు కేఎం, డైరెక్టర్ కన్సల్టెంట్ అరుణ వకులాభరణం, బీఎన్ఐ డ్రీమ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

